# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 29 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4




ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ విజేతగా దివ్య దేశ్‌ముఖ్

వివరాలు 4వ పేజీలో

# రిజర్వేషన్లకై చలో ఢిల్లీ



- ఆగస్టు 5న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి
- పార్లమెంటులో వాయిదా తీర్మానం
- 6న జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా
- 7న 200 మంది ప్రజాప్రతినిధులతో రాష్ట్రపతి వద్దకు సీఎం బృందం
- అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల ఎత్తివేత
- మున్సిపల్ కార్పొరేషన్లలో మైక్రో బ్రూవరీస్ ఏర్పాటు
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం
- క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు పొన్నం, కొండా సురేఖ, అడ్లూరి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీసీ రిజర్వేషన్లపై చలో ఢిల్లీకి రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆగస్టు 5,6,7 తేదీల్లో ఢిల్లీలోనే మకాం వేసి, 42 శాతం బీసీ రిజర్వేషన్లను సాధించుకురావాలని నిర్ణయించారు. సోమవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. దాదాపు నాలుగున్నర గంటలపాటు పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రధానంగా 42 శాతం బీసీ రిజర్వేషన్లపైనే చర్చ జరిగింది. బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదంలో కేంద్ర ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ ఆగస్టు 5వ తేదీ పార్టీ ఎంపీల ద్వారా పార్లమెంటులో వాయిదా తీర్మానం ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆగస్టు 6వ తేదీ రాష్ట్రంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులందరితో కలిసి జంతర్‌మంతర్ వద్ద 'చలో ఢిల్లీ' ధర్నాను నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 7వ తేదీ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దాదాపు 200 మంది ప్రజాప్రతినిధులతో రాష్ట్రపతిని కలిసి, పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లుల్ని ఆమోదించాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. పంచాయతీ రాజ్‌చట్టం-2018లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పంపిన ముసాయిదా ఆర్డినెన్స్‌ను న్యాయ పరిశీలన కోసం ఆయన రాష్ట్రపతికి పంపిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు కావాలంటే కీలకమైన ఈ బిల్లు ఆమోదం తప్పనిసరి. అందువల్ల దీనిపై నేరుగా రాష్ట్రపతినే కలిసి, విన్నవించాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో రవాణాశాఖకు చెందిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్ని ఎత్తివేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. జాతీయ రహదారులపై రవాణాకు ఇబ్బంది లేకుండా రాష్ట్ర సరిహద్దుల్లోని మొత్తం 15 చెక్ పోస్టులు ఎత్తివేస్తారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం వీటిని తొలగించాలని రాష్ట్రాలకు సూచించింది. అయితే ఈ చెక్ పోస్టుల్ని రవాణాశాఖ సిబ్బందితో కాకుండా వాహన్, అడ్వాన్స్‌డ్ సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ చేయాలని నిర్ణయించారు. అలాగే రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, కోర్ తెలంగాణ అర్బన్ సిటీ ఏరియాల్లో మైక్రో బ్రూవరీస్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు మైక్రో బ్రూవరీస్ చట్టానికి పలు సవరణలు చేయాలని నిర్ణయించారు. మెడికల్ సీట్లకు సంబంధించిన జీవో 33పై కూడా మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఎట్టిపరిస్థితుల్లోనూ తెలంగాణ విద్యార్థులకే మెడికల్ సీట్లు వచ్చేలా సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాలని మంత్రులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. దీనికోసం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా నేతృత్వంలో అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డితో మాట్లాడి, సుప్రీంలో వాదనల కోసం సమర్థులైన న్యాయవాదుల్ని నియమించుకోవాలని సూచించారు. సమావేశం అనంతరం మంత్రివర్గ నిర్ణయాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ మీడియాకు వివరించారు.



## పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి హతం

- మరో ఇద్దరు ఉగ్రవాదులు కూడా..
- ఆపరేషన్ మహదేవ్ విజయవంతం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన మారణహోమం దేశవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. అతి సమీపం నుంచి కాల్పులు జరిపి 25 మంది పర్యాటకులు, ఓ స్థానిక కశ్మీరీ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. దాడికి పాల్పడి పారిపోయిన ఉగ్రవాదుల కోసం గత కొన్ని నెలలుగా భద్రతా దళాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. తాజాగా సోమవారం జరిగిన ఆపరేషన్ మహదేవ్ లో భద్రతా బలగాలకు పెద్ద విజయం లభించింది. ఈ ఎన్‌కౌంటర్‌లో పహల్గామ్ దాడికి సంబంధించి ప్రధాన సూత్రధారి సులేమాన్ అలియాస్ మూసా సహా ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చారు.

ఈ ఆపరేషన్‌కి మహదేవ్ పర్వత ప్రాంతం వేదికైంది. ఉగ్రవాదులు అక్కడ తలదాచుకున్నారన్న పక్కా సమాచారంతో ఉదయం 11:30 గంటల ప్రాంతంలో ఆపరేషన్ ప్రారంభమైంది. శ్రీనగర్‌కు సమీపంలోని దాచిగాం ప్రాంతంలో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. మూడు గంటల పాటు కొనసాగిన ఎన్కౌంటర్‌లో ముగ్గురు ముష్కరులు మట్టుపడ్డారు. డ్రోన్‌ల ద్వారా మృతదేహాలను గుర్తించి, వారి వివరాలను ధృవీకరించారు. వారి వద్ద నుండి ఏకే-47 రైఫిల్స్, 17 గ్రెనేడ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ విజయంతో భద్రతా బలగాలు ఉగ్రవాదుల నెట్‌వర్క్‌ను మరింతగా దెబ్బతీసేలా ఆపరేషన్‌లను వేగవంతం చేస్తున్నాయి. పాకిస్థాన్ ప్రేరిత ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు భారత్ తీసుకుంటున్న చర్యల్లో ఇది కీలక మైలురాయిగా నిలిచింది.మృతి చెందిన ఉగ్రవాదుల్లో ఒకరు గతేడాది అక్టోబర్‌లో సోనామార్గ్ సొరంగం వద్ద జరిగిన ఉగ్రదాడిలో పాల్గొన్న జిబ్రాన్‌గా గుర్తించారు. నాటి దాడిలో వైద్యుడు సహా మొత్తం ఏడుగురు అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఘటనాస్థలంలో ఒక ఎం4 కార్బైన్ రైఫిల్, రెండు ఏకే రైఫిల్స్‌తో పాటు పలు ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

ఆపరేషన్ మహదేవ్ పేరుతో జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టింది. హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాల సమాచారంతో నెల రోజుల నుంచి గాలింపు చేపట్టారు. చివరకు సోమవారం ఉదయం దాచిగామ్ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడుతుండగా, భద్రతా దళాలపైకి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపగా ముగ్గురు హతమయ్యారు. మృతిచెందిన ముగ్గురూ విదేశీ ఉగ్రవాదులని, లష్కరే తయిబాకు చెందిన వారని సమాచారం. అంతకుముందు పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ ఆపరేషన్ చేపట్టామని, మరణించిన ఉగ్రవాదులు ఆ దాడికి పాల్పడిన వారిగానే తెలుస్తోందని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులు



- రాష్ట్రపతి ఆమోదంతో దేశవ్యాప్తంగా 19 నియామకాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుల మేరకు 19 మంది న్యాయమూర్తులు, అదనపు న్యాయమూర్తులను నియమించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ సోమవారం అధికారిక ప్రకటన చేశారు.

ఈ క్రమంలో తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులుగా నియామకం జరిగింది. వీరి వివరాలు ఈ విధంగా ఉన్నాయి: గౌస్ మీరా మొహియుద్దీన్, చలపతిరావు సుద్దాల, వాకిటి రామకృష్ణారెడ్డి, గడి ప్రవీణ్ కుమార్ ఇక మధ్యప్రదేశ్ హైకోర్టుకు 11 మంది, అందులో ఏడుగురు న్యాయమూర్తులు, నలుగురు అదనపు న్యాయమూర్తులు నియమితులయ్యారు. గౌహతి హైకోర్టుకు నలుగురు నియమితులయ్యారు.

తెలంగాణ హైకోర్టుకు కొత్త జడ్జీలుగా నియమితులైన నలుగురు అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ నరసింహశర్మతో కలసి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం హైకోర్టులో 26 (సీజేతో కలిపి) మంది న్యాయమూర్తులున్నారు. ఈ నలుగురి ప్రమాణం స్వీకారం తర్వాత ఆ సంఖ్య 30కి చేరనుంది. ఇంకా 12 పోస్టులు ఖాళీగా ఉంటాయి. కాగా, సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ సుమలత బదిలీపై ఇక్కడికి రావాల్సి ఉంది. ఈ బదిలీలకు కేంద్రం ఇంకా ఆమోదం తెలుపలేదు. అలాగే తడకమళ్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.



## షటిల్ ఆడుతుండగా గుండెపోటుతో యువకుడి మృతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నగరంలోని నాగోల్ స్టేడియంలో షటిల్ ఆడుతుండగా ఓ యువకుడు గుండెపోటుతో కుప్పకూలిన సంఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఘటన వివరాలు ఇలా.. ఖమ్మం జిల్లా తల్లాడకు చెందిన గుండ్ల రాకేష్ (25) అనే యువకుడు నాగోల్ స్టేడియంలో మిత్రులతో కలిసి షటిల్ ఆడుతుండగా అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న యువకులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాకేష్ తండ్రి గుండ్ల వెంకటేశ్వర్లు తల్లాడ మాజీ ఉప సర్పంచ్‌గా పనిచేశారు. రాకేష్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. క్రీడా మైదానంలోనే ఇలా ప్రాణాలు కోల్పోవడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

### జర్నలిస్టు కాయితి బాలుపై

## 163 సెక్షన్ అమలు అన్యాయం



- నిషేధం ఎత్తివేయకపోతే "చలో సిరిసిల్ల" హెచ్చరిక
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ కళాకారులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాజన్న సిరిసిల్ల జిల్లా వాసి, సీనియర్ జర్నలిస్ట్ కాయితి బాలు పై భారతీయ నాగరిక సురక్షా సంహితలోని సెక్షన్ 163 కింద నెల రోజులపాటు ఎలాంటి ప్రకటనలు చేయరాదని, వీడియో సందేశాలు విడుదల చేయరాదని జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తహసిల్దార్ అమలు చేసిన నిషేధాన్ని బీసీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ అంశంపై హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ కళాకారులు వరంగల్ శ్రీనివాస్, దరువు అంజన్న, మద్దెల సందీప్, మానుకోట ప్రసాద్, కోదాడ శ్రీనివాస్, మల్లిక్ తేజ తదితరులు పాల్గొని మాట్లాడారు.

"ఇది ఒక జర్నలిస్టు భావ ప్రకటన స్వేచ్ఛను కాలరాయడమే తప్ప మరొకటి కాదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ద్వారా కల్పించిన హక్కులను హరించడమే అవుతుంది" అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఒక జర్నలిస్టు గానీ, సాధారణ పౌరుడు గానీ సామాజిక మాధ్యమాల్లో తమ అభిప్రాయాన్ని వెల్లడించవచ్చు. అది చట్టానికి వ్యతిరేకంగా ఉంటే న్యాయపరంగా స్పందించే అవకాశం ప్రభుత్వానికి ఉంది. కానీ 163 సెక్షన్ ను అనవసరంగా ప్రయోగించడం అధికారాల దుర్వినియోగమే" అని అన్నారు. కోర్టులు ఇప్పటికే సోషల్ మీడియాలో వ్యక్తులు చేసే వ్యాఖ్యలపై పలు మార్లు మార్గనిర్దేశం చేశాయని, వాటిని పరిశీలించి కాయితి బాలు పై విధించిన నిషేధాన్ని తహసిల్దార్ తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. "బాలు పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి. లేకపోతే వేలాదిమంది బీసీ కళాకారులతో చలో సిరిసిల్ల ఉద్యమాన్ని ప్రారంభిస్తామన్నారు. సంఘవాదుల ఆధిపత్యాన్ని అణిచివేసే వరకు పోరాటం సాగుతుందన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌పై వాడీవేడీ చర్చ



- విపక్షాల ఆందోళనలతో ఉభయ సభలు దద్దరిల్లిన వైనం
- పహల్గాం ఘటన, ఆపరేషన్ సిందూర్‌పై అధికార, విపక్షాల మధ్య తీవ్ర విమర్శల పర్వం
- విపక్షాలు బిహార్ ఓటర్ల జాబితా అంశంతో రాజ్యసభలో రభస
- చివరకు ఉభయ సభలు వాయిదా


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పహల్గాం దాడి నేపథ్యంలో చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం పార్లమెంట్‌లో అధికార, విపక్షాల మధ్య వాడి వాడిగా చర్చ జరిగింది. కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వగానే విపక్ష సభ్యులు నినాదాలతో సభ వాతావరణాన్ని ఉద్విగ్నతకు గురిచేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆపరేషన్ వివరాలు వెల్లడించగా, కాంగ్రెస్ ఆగ్రహంతో స్పందించింది. హోంమంత్రి అమిత్ షా మధ్యలో జోక్యం చేసుకుంటూ విపక్షాలపై ధ్వజమెత్తారు.

రాజ్‌నాథ్ మాట్లాడుతూ, "ఆపరేషన్ సిందూర్ మిలటరీ చరిత్రలో మైలురాయిగా నిలుస్తుంది. 22 నిమిషాల్లో 9 కీలక ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయడం గొప్ప విజయాన్ని చాటింది" అన్నారు. పాక్ పౌరులపై ప్రభావం లేకుండా, కేవలం ఉగ్రవాదులనే లక్ష్యంగా దాడి చేశామని పేర్కొన్నారు.

జైశంకర్ మాట్లాడుతూ, "ట్రంప్

మిగితా 2వ పేజీలో



## రేవంత్ రెడ్డి పాలమూరుకు ఏమీ చేయలేదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. రామచంద్ర రావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

"నా సొంత జిల్లా, నా ఆత్మ"గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడుతున్న పాలమూరు జిల్లాకు ఆయన చేసింది ఏమీ లేదని, ప్రజల కళ్లకు వేటముచ్చేలా "అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నాడని" బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. రామచంద్రరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన తర్వాత తొలిసారి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించిన రామచంద్రరావుకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. అనంతరం అన్నపూర్ణ గార్డెన్‌లో జరిగిన కార్యకర్తల సభలో ఆయన ముఖ్యంగా మాట్లాడారు.


రెండేళ్ల పాలన పూర్తవుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరుకు ఏ ప్రాజెక్టు పూర్తి చేశారో చెప్పాలంటూ నిలదీశారు. పాలమూరు - రంగారెడ్డి, నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి, కోయిలసాగర్ ప్రాజెక్టులన్నీ మధ్యలోనే ఆగిపోయాయని విమర్శించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయని, అటువంటి పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల పతన స్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చున్నారు.

**కులగణనపై కాంగ్రెస్‌పై ధ్వజమెత్తిన రామచంద్రరావు**

బీసీల జనాభా 46 శాతమని చెప్పి 42 శాతం రిజర్వేషన్లని ప్రకటించి చివరికి అందులో 10 శాతం ముస్లింలకు కేటాయించడం ద్వారా బీసీలకు కేవలం 32 శాతమే మిగిలిందని, ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న చారిత్రక మోసమని అన్నారు. బీసీలకు న్యాయం చేయడం పేరుతో నెపంతో తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. మోడీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్‌లో 27 మంది బీసీ మంత్రులు ఉన్నారంటే, రేవంత్ నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గంలో కేవలం ఇద్దరే బీసీ మంత్రులుండటం ఏమిటని ప్రశ్నించారు. బీసీ హాస్టళ్లలో నాణ్యతలేని ఆహారం అందించి ఫుడ్ పాయిజన్ కేసులు నమోదు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఇచ్చిన ఆరు గ్యారెంటీలూ గాలిలో కలిసిపోయాయని ఎద్దేవా చేశారు. ప్రజలు కాంగ్రెస్

మిగితా 2వ పేజీలో

## శ్రీశైలం నాలుగు గేట్లు ఎత్తివేత



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

శ్రీశైల జలాశయానికి సోమవారం భారీ వరద నమోదైంది. ఎగువ జూరాల సుంకేసుల బ్యారేజీల నుంచి 2 లక్షల 42 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు అధికారులు నాలుగు గేట్లను పది అడుగుల మేర ఎత్తి లక్షా ఎనిమిది

మిగితా 2వ పేజీలో

## అక్కను చంపిన తమ్ముడు

- రంగారెడ్డి జిల్లాలో పరువు హత్య
- ప్రేమ పేరుతో పరువు తీసిందని...



వివరాలు 2వ పేజీలో

# ఆపరేషన్ సిందూర్‌పై వాడీవేడీ చర్చ

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యలకు ఈ ఆపరేషన్‌కు సంబంధం లేదని స్పష్టం చేశారు. అమెరికాతో వాణిజ్య ఒత్తిళ్లు ఎలాంటి ప్రభావం చూపలేవని, భారత్ పూర్తి స్వతంత్రంగా పనిచేసిందని" అన్నారు.

కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ, "పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవడం ప్రభుత్వ లక్ష్యం కాకపోతే, సిందూర్ ఆపరేషన్ ఎందుకు చేపట్టారు? ఎందుకు మధ్యలో ఆపారు?" అని ప్రశ్నించారు.

బిహార్‌లో ఓటర్ల జాబితాలో అవకతవకలపై చర్చ జరిపేలా రాజ్యసభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. మొత్తం 26 వాయిదా తీర్మానాలు డిప్యూటీ ఛైర్మన్ వద్దకు వెళ్లాయి. వాటిని తిరస్కరించడంతో సభ రభసకు దారితీసింది. చివరకు సభను మంగళవారానికి వాయిదా వేశారు.

# రేవంత్ రెడ్డి పాలమూరుకు ఏమీ చేయలేదు

(మొదటి పేజీ తరువాయి)

చేపడుతున్న పథకాలపై విశ్వాసం లేకుండా పోయిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకే విజయావకాశాలు మెండుగా ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు.

**డీకే అరుణ సంచలన వ్యాఖ్యలు**

ఈ సభలో మాట్లాడిన మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, గత ఎన్నికల్లో తనను ఓడించేందుకు పార్టీకి చెందిన కొంతమంది నాయకులు కుట్రలు పన్నారని, ఫామ్‌హౌస్‌లలో దావత్‌లు ఏర్పాటు చేశారని ఆరోపించారు. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతృత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ బీసీల పక్షాన నిలుస్తుందని, పాలమూరు జిల్లా పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని కె. రామచంద్రరావు పేర్కొన్నారు. ఐక్యతతో పార్టీ శ్రేణులు పనిచేస్తే భవిష్యత్ బీజేపీదే అని ధీమా వ్యక్తం చేశారు.

# శ్రీశైలం నాలుగు గేట్లు ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

వేల క్యూసెక్కులు దిగువ నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ ద్వారా మరో 67వేల క్యూసెక్కులు కలుపుకుని మొత్తం లక్షా 74 వేల క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం జలాశయంలో 883 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. టిఎంసీలలో 215 టిఎంసీలకు గాను 204 టిఎంసీలు నిల్వ ఉంది. జూరాల ప్రాజెక్టుకు ఎగువ నారాయణపూర్ నుంచి 90 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 10 గేట్లు ఎత్తి లక్షా క్యూసెక్కులు శ్రీశైలం వైపుకు వదులుతున్నారు. దీంతో పాటు విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 27 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల బ్యారేజికి 97 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 17 గేట్లను ఒక మీటర్ మేర దిగువ శ్రీశైలం వైపుకు 95 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. అటు జూరాల, ఇటు సుంకేసుల నుంచి భారీగా వరద శ్రీశైలం వైపుకు వస్తుండడంతో జలాశయం నిండుకుండగా మారింది. మరో వారం రోజుల పాటు హెచ్చుతగ్గుల మధ్య వరద కొనసాగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# అక్కను చంపిన తమ్ముడు

**బలగం టీవీ, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలో ప్రేమ వ్యవహారం ఓ యువతిని బలితీసుకుంది. కుటుంబ పరువు పోయిందన్న కోపంతో తమ్ముడు తన అక్కను చంపిన దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన దేశాల రాఘవేందర్ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన కుమార్తె రుచిత(21) అదే గ్రామానికి చెందిన ఈర్లపల్లి దినేష్ అనే యువకుడిని ప్రేమించింది. ఈ విషయం బయటపడటంతో పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగింది. అందులో దినేష్ ఇకపై రుచితతో మాట్లాడకూడదని, సంబంధం ముగిసిందని ఒప్పందం కుదిరింది. అయితే ఇటీవల మళ్లీ దినేష్ రుచితకు ఫోన్ చేయడం గమనించిన ఆమె తమ్ముడు రోహిత్ ఆగ్రహంతో తల్లడిల్లిపోయాడు. "మన పరువు తీసిన వాడితో ఎందుకు మాట్లాడుతున్నావు?" అంటూ రుచితను ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కోపంతో రెచ్చిపోయిన రోహిత్ కత్తితో దాడి చేసి రుచితను బలిగొట్టినట్టు మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనను గమనించిన గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరువు పేరుతో ఇలా గుండె చంపడం తట్టుకోలేకపోతున్నామని పేర్కొంటున్నారు.

## పెరిగిన రవాణా సర్వీస్ చార్జీలు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర రవాణాశాఖలో సర్వీస్ ఛార్జీలు భారీగా పెరిగాయి. వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, టాక్సేషన్, ఫిట్నెస్ సర్టిఫికెట్లకు సంబంధించిన ఛార్జీలను గణనీయంగా పెంచుతూ ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి.కొత్త రేట్ల ప్రకారం లైసెన్స్ సర్వీస్ ఛార్జీని రూ. 200కు, మోటార్ వెహికల్ డ్రైవింగ్ సర్వీస్ ఛార్జీని రూ. 300కు పెంచారు. నాన్ ట్రాన్స్ పోర్ట్ లైసెన్స్‌కు రూ. 400 వసూలు చేయనున్నారు. వాహన రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా పెరిగాయి. టూ వీలర్ల రిజిస్ట్రేషన్‌లో కొనుగోలు ధరపై 0.5 శాతం అదనపు ఛార్జీ వసూలు చేయనుండగా, నాన్- ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై 0.1 శాతం పెంపు అమలులోకి వచ్చింది. ఆటో రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250 చేరగా, మిగతా వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 500కి పెరిగింది. ఇక ఫిట్నెస్ సర్టిఫికెట్ రేట్లు కూడా పెరిగాయి. త్రీ వీలర్లకు రూ. 200, మిగతా వాహనాలకు రూ. 300 వసూలు చేయనున్నారు. అదే విధంగా పర్మిట్ సర్టిఫికెట్ ఫీజులు కూడా పెరిగాయి. త్రీ వీలర్లకు రూ. 200, మిగతా వాహనాలకు రూ. 300 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ పెంపుతో రవాణా శాఖలో సేవలు పొందేవారికి అదనపు వ్యయం తప్పదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహన యజమానులపై ఇప్పటికే పెట్రోల్ ,డీజిల్ ధరలు, బీమా ఖర్చులు, టోల్ ఫీజులు వంటి భారం ఉండగా ఇప్పుడు సర్వీస్ ఛార్జీల పెంపు మరింత భారంగా మారిందనే అభిప్రాయాన్ని వినియోగదారులు చెబుతున్నారు. సవరించిన ధరలు భారంగా ఉన్నాయని, వాటిని కొంతమేర తగ్గించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# సంక్షేమ పథకాల అభివృద్ధిపై డిప్యూటీ సీఎం సమీక్ష

**బలగం టీవీ, హైదరాబాద్**




ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం (ఉమ్మడి ఖమ్మం) జిల్లాల్లో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, వర్షాకాల సమస్యలపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఆదివారం పాల్వంచలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో ఈ సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు వాకాటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ తదితర అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాల్లో జరుగుతున్న కార్యక్రమాలపై వివరాలు సమర్పించారు.

ఉపముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల పరిస్థితిని ఎదుర్కొనేందుకు తగిన యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు వైద్య సేవలు, సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజన రైతుల కోసం సోలార్ పంపులు, డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులు ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. ఇందుకు మూడు సంవత్సరాల్లో రూ.12,600 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు మహిళా సంఘాల ద్వారా ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యువత కోసం ప్రతి జిల్లాలో 25 ఎకరాల స్థలంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు' ఏర్పాటు చేస్తామని చెప్పారు.

మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు రూ.200 కోట్ల విలువైన ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు అందిందని చెప్పారు. అలాగే రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రజలకు అందించామని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేశామని, వారంవారీగా నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు లక్ష కోట్ల రూపాయల బ్యాంకు రుణాల లింకేజ్‌కు ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ సంకల్పాన్ని ప్రజలతో భాగస్వామ్యంగా మలచుకోవడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

# రూ.5 కోట్ల విలువైన 935 కిలోల గంజాయి పట్టివేత



**బలగం టీవీ, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాటసింగారం వద్ద భారీ మొత్తంలో గంజాయి పట్టుబడింది. సుమారు రూ.5 కోట్ల విలువైన 935 కిలోల గంజాయిని ఈగల్ టీమ్, పోలీసులు సంయుక్తంగా స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ఓ ముఠా పెద్దఎత్తున గంజాయి అక్రమ రవాణా చేస్తోంది. పక్కా సమాచారం అందుకున్న ఖమ్మం-రాచకొండ నార్కోటిక్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. బాటసింగారం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా.. గంజాయి రవాణాకు ఎస్కార్ట్ చేసిన టయోటా ఇన్నోవాను పోలీసులు అడ్డుకున్నారు. అలాగే టాటా ఐచ్చార్ వాహనాన్ని కూడా తనిఖీ చేసి పండ్ల ట్రేల కింద దాచిన గంజాయిని గుర్తించారు. ముఠా సారధి పవార్‌కుమార్ బాడు, సమాధాన్ భిస్, వినాయక్ పవార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 455 ప్యాకెట్ల గంజాయి, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరాదారులు సచిన్ గంగారాం చౌచౌహాన్, విక్కీ సేథ్ పరారీలో ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

# 'సృష్టి' కేసు దర్యాప్తు

**బలగం టీవీ, హైదరాబాద్**

సికింద్రాబాద్‌లోని 'సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్' కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. హాస్పిటల్ నుంచి భారీగా సంఖ్యలో ఫైల్స్ సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఐవీఎఫ్‌తోపాటు సరోగసీ కింద సంతానం పొందిన దంపతుల వివరాలను సైతం సేకరించారు. వీరికి పోలీసుల నుంచి ఫోన్ కాల్స్ రాగానే.. స్పందించకపోవడం, ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం, ఫోన్ కట్ చేయడం, ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. గడిచిన నాలుగు రోజులుగా సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వాకాలు, విస్తు గొలిపే విషయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. దీంతో తమ విషయంలో కూడా ఎలాంటి తప్పిదాలు ఎక్కడ బయటపడుతాయోనన్న భయంతో దంపతులు ఫోన్ కాల్స్‌కు అందుబాటులోకి రావడం లేదు. కాగా సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కి సంబంధించి రంగారెడ్డి జిల్లా కొండాపూర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలో కూడా బ్రాంచీలు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు ఆ బ్రాంచీల నుంచి కూడా వివరాలను సేకరిస్తున్నారు.

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో కొందరు వైద్యులు ప్రయివేటు ఆస్పత్రులు, మెడికల్ షాపులతో కుమ్మక్కవుతున్నట్టు ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. 2023లో వారాసిగూడలోని ఓ ప్రయివేటు మెడికల్ షాపులో దాదాపు రూ.2లక్షల విలువైన ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు ఉచితంగా అందించాల్సిన మందులను డ్రగ్స్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంత పెద్ద మొత్తంలో సర్కార్ మందులు లభ్యం కావడంతో దగ్గరలో ఉన్న గాంధీ ఆస్పత్రి నుంచే సరపరా అయినట్టు అప్పట్లో అందరూ అనుమానం వ్యక్తం చేశారు. ఈ మెడికల్ షాపు ఈ మందులను ఎవరూ సరఫరా చేశారనే విషయాలపై అప్పట్లో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దర్యాప్తు చేపట్టినా.. వివరాలను బయటికి వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. కాగా మరోసారి గాంధీ ఆస్పత్రికి చెందిన డాక్టర్ సరోగసీ వ్యవహారంలో చిక్కుకోవడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో అరెస్టు చేసిన 8 మంది నిందితుల్లో గాంధీ ఆస్పత్రిలో పని చేస్తున్న అనస్తీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ నర్గుల సదానందం కూడా ఉన్నారు. డాక్టర్ నమ్రతతో కలిసి ఆయన కూడా ఈ వ్యవహారంలో పాలు పంచుకున్నట్టు తేలడంతో 14 రోజుల రిమాండ్‌లో ఉన్న సదానందం పాత్రపై కూడా పోలీసులు విచారణ చేపట్టారు. ప్రభుత్వ అధికారి అయ్యి ఉండి, ప్రయివేటు ఆస్పత్రికి సహాయ సహకారాలు అందించడం వెనుక ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా నిందితులను తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

**హెచ్ఆర్సీ ఆగ్రహం.. విచారణకు ఆదేశం**

సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో చేపట్టిన అక్రమ సరోగసీ, శిశువుల విక్రయం పట్ల రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. వివాహమై ఏండ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టని దంపతులను ఈ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ నమ్రత మోసం చేయడాన్ని హెచ్ఆర్సీ తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు నవతెలంగాణతోపాటు ఇతర మీడియాలో ప్రచురితమైన కథనాలకు హెచ్ఆర్సీ ఛైర్మెన్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ స్పందించి కేసును సుమోటాగా స్వీకరించి విచారణకు ఆదేశించారు. ఆగస్టు 28వ తేదీ లోగా ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో చట్టవిరుద్ధమైన, అనైతికమైన పద్ధతులను సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత ఎంచుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నిబంధనలు ప్రకారం కోడిగుడ్ల సరఫరా టెండర్లు నమోదు చేయాలి

- ఆగస్టు 7 లోపు ఆన్ లైన్‌లో టెండర్ దాఖలు చేయాలి..
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- జిల్లా స్థాయి కోడి గుడ్ల ప్రోక్యూర్ మెంట్ పై ప్రీ బిడ్ సమావేశం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అంగన్వాడి కేంద్రాలు రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు అవసరమైన కోడిగుడ్ల సరఫరా చేసేందుకు నిబంధనలు ప్రకారం టెండర్ దాఖలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కోడి గుడ్ల ప్రోక్యూర్ మెంట్ పై నిర్వహించిన ప్రీ బిడ్ సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. ఒక సంవత్సరం పాటు కోడిగుడ్ల సరఫరా టెండర్ ప్రక్రియ పై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు (ఎస్సి,ఎస్టీ, బీసి, మైనారిటీ కేజీబీవీ...) మధ్యాహ్న భోజన పథకం మినహాయించి ఒక సంవత్సరం పాటు అవసరమైన కోడి గుడ్లు ప్రమాణాల ప్రకారం సరఫరా చేసేందుకు టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.కోడిగుడ్ల సరఫరా టెండర్ ను దాఖలు చేయాలంటే తెలంగాణలోని కోళ్ల ఫారం గల పౌల్ట్రీ రైతులు గత 3 సంవత్సరాల ఓనర్ షిప్ (2022-25) చూపించే టెండర్లలో పాల్గొనే అవకాశం ఉంటుందని, లీజ్ కోళ్ల ఫారంకు అర్హత లేదని, ఆగ్ మార్క్ సర్టిఫికేషన్ ఉండాలని, ఒక కోళ్ల ఫారం 8 జిల్లాల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, టెండర్ డాక్యుమెంట్ లో ఉన్న గుడ్లలో కనీసం 40 శాతం వరకు సొంతంగా కోళ్ల ఫారం నుంచి ఉత్పత్తి చేయాలని మిగిలినవి పౌల్ట్రీ రైతుల నుంచి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సర్టిఫికేషన్ తో టై అప్ చేసుకోవచ్చని అన్నారు.టెండర్ దాఖలు చేసే పౌల్ట్రీ రైతులకు గత మూడు సంవత్సరాలలో ఒక సంవత్సరంలో ఐదు కోట్ల రూపాయల విలువగల గుడ్లు సరఫరా చేసిన అనుభవం ఉండాలని, వార్షిక టర్న్ ఓవర్ 4 కోట్ల పైగా ఉండాలని, అవసరమైన లైసెన్సులు ఉండాలని అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో సంవత్సరం పాటు అవసరమైన కోటి 34 లక్షల 6 వేల 730 కోడిగుడ్లు సుమారుగా అవసరం ఉన్నాయని, ప్రతి కోడి గుడ్డుకు 7 రూపాయల చొప్పున నెక్ రేట్స్ ప్రకారం ప్రభుత్వం చెల్లింపు చేస్తుందని, వీటీ పంపిణీకి ఆసక్తి, అర్హత గల వారు నాన్ రిఫండబుల్ డీడీ 10 వేల రూపాయలు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రాజన్న సిరిసిల్ల పేరు మీద డిడి తీసి టెండర్ దాఖలు చేయాలని, టెండర్ దక్కిన వారు 1% ఈ.ఎం.డీ క్రింద 9 లక్షల 38 వేల 471 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. కోడిగుడ్ల సరఫరా టెండర్ బిడ్ డాక్యుమెంట్ జూలై 29 లోపు డౌన్ లోడ్ చేసుకోని ఆగస్టు 7,2025 సాయంత్రం 4 గంటల లోపు ఆన్ లైన్ లో, ఆగస్టు 8,2205 సాయంత్రం 4 గంటల లోపు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హల్ నందు టెండర్ డాక్యుమెంట్లు హార్డ్ కాపీలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఆగస్టు 12న టెక్నికల్ బెడ్, 13న ఫైనల్ బెడ్ ఓపెనింగ్ ఉంటుందని పేర్కొన్నారు. టెండర్లను ఆన్ లైన్ లో ఈ -టెండరింగ్ ప్లాట్ ఫామ్ లో మాత్రమే నమోదు చేయాలని, ఆఫ్ లైన్ విధానంలో అనుమతించడం లేదని అన్నారు. టెండర్ దాఖలు సమయంలో తప్పుడు సమాచారం అందిస్తే సదరు టెండర్ ను ఏ క్షణంలోనైనా రద్దు చేయడమే కాకుండా బిడ్డను బ్లాక్ లిస్ట్ చేయడం జరుగుతుందని, క్రిమినల్ ప్రొసీక్యూషన్ కూడా చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్ రావు, జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఆయా విద్యాలయాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి పంట పరిశీలించిన వ్యవసాయ అధికారిని



- రైతులకు తగు సూచనలు తెలిపిన వ్యవసాయ అధికారిని ప్రణీత

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో కోరేం గ్రామంలో మండల వ్యవసాయ అధికారిని ప్రణీత, ఏ.ఈ.ఓ లక్ష్మణ్ తో గాజుల రాజు వేసిన పత్తి పంటను సోమవారం పరిశీలించినారు. ఈ సందర్భంగా ప్రణీత మాట్లాడుతూ: చేనులో వేరు కుళ్ళు తెగులు గమనించడం జరిగింది. అర్ధాంతరంగా మొక్క ఎండిపోయి, గుంపులు గుంపులుగా మొక్కలపై నుండి కిందికి వాడిపోయి వేలడుతూ ఉంటాయి. భూమిలో ఉండే శీలీంద్రం ద్వారా ఈ తెగులు ఆశిస్తుంది.భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు పైరు అన్ని దశల్లో కనపడుతుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండేజిం 1 గ్రాము లీటర్ నీటికి కలిపిన ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల మొదల్ల చుట్టూ నేలపై పోయాలి. సిఫారసు మేరకు పొటాష్ ఎరువులను తప్పక వాడాలి.ఏ పంటలోనైన డి.ఎ.పి లేదా కాంప్లెక్స్ ఎరువులను పై పాటుగా వేయకూడదు.కేవలం అడుగు మందుగా మాత్రమే వాడాలి. పత్తి విత్తిన 20, 40, 60, 80 రోజుల్లో పై పాటుగా 25 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ని వేసుకోవాలి. వరి పంటలో ఎకరానికి 90 కిలోల యూరియా,50 కిలోల 20-20-0-13, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అవసరం పడుతుంది. 20-20-0-13 పూర్తిగా అడుగు ముందుగానే వేసుకోవాలి. యూరియాని 3 దఫలలో 30 కిలోల చొప్పున నాటు సమయంలో, దుబ్బు చేసేప్పుడు, చిరుకంకి( అంకురం) దశలోనూ, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ని 2 దఫాలలో నాటు చేసేప్పుడు, చిరు కంకి దశలోనూ వేసుకోవాలి.

యూరియాని అధికంగా వాడడం వల్ల చీడ పీడల ఉధృతి పెరగడమే కాకుండా నేల ఆరోగ్యం దెబ్బతిని పర్యావరణ కాలుష్యము పెరుగుతుంది. కావున రైతులు అవసరమైన మేర మాత్రమే రసాయన ఎరువులను వాడవల్సిందిగా రైతులకు తెలిపారు.

# ప్రజావాణితో సమస్యల పరిష్కారం..

- మొత్తం 204 దరఖాస్తుల రాక
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు ప్రజావాణికి మొత్తం 204 దరఖాస్తులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే తెలిపారు. గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 25 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# ఏఎస్ఐగా ఉద్యోగొన్నతి పొందిన సత్తయ్య..

- అభినందించిన ఎస్పీ మహేష్ బి గీతే

**బలగం టీవీ, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి పోలీస్ స్టేషన్ లో గత మూడున్నర సంవత్సరాలుగా పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. సిరిసిల్లలో ఎస్పీ మహేష్ గీతే ఏఎస్ఐ సత్తయ్యను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే బోయినిపల్లి పోలీస్ స్టేషన్ లో ఎస్సై రాజశేఖర్ తో పాటు సిబ్బంది సాలువతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.సత్తయ్యకు ఏఎస్ఐగా ప్రమోషన్ రావడంతో పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. బోయినిపల్లి మండల ప్రజలు తను పనిచేసిన కాలంలో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

# జర్నలిస్ట్ కాయితి బాలుపై సెక్షన్ 163 విధించడం నిరంకుశ చర్య

- టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్

**బలగం టీవీ, సిరిసిల్ల**



జర్నలిస్టు కాయితి బాలు పై భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 163 విధించి నెల రోజుల పాటు ఎలాంటి ప్రకటన చేయరాదంటూ, రాతపూర్వకమైన, వీడియో సందేశం గాని ప్రచారం చేయరాదంటూ సిరిసిల్ల తహసిల్దార్ నిషేధం విధించడం నిరంకుశ చర్య గా భావిస్తున్నానని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్ అన్నారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

"ఇది ఒక జర్నలిస్టు భావ ప్రకటన స్వేచ్ఛను కాలరాయడమే" అంటూ విమర్శించారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 19 ద్వారా ప్రతి పౌరుడికి కల్పించిన అభిప్రాయ స్వేచ్ఛను గౌరవించకుండా, అధికార దుర్వినియోగంగా తహసీల్దార్ ఈ నిషేధాన్ని విధించారని అభిప్రాయపడ్డారు. న్యాయబద్ధంగా తప్పులుంటే దాన్ని సవాలు చేయవచ్చు, కానీ... ఏదైనా విషయాన్ని జర్నలిస్టు లేదా సామాన్య పౌరుడు సోషల్ మీడియా, ముద్రిత లేదా దృశ్య శ్రవణ మాధ్యమాల ద్వారా ప్రజల ముందుంచినప్పుడు, అందులో చట్టపరమైన లోపాలు ఉన్నట్లయితే, చట్టబద్ధంగా సవాలు చేయాల్సిందే తప్ప, నిషేధం విధించడం అనేది స్పష్టమైన అధికారం దుర్వినియోగం అని ఆయన అన్నారు. "సోషల్ మీడియాలో వ్యక్తులు వ్యక్తపరిచే అభిప్రాయాలపై ఎలా స్పందించాలో కోర్టులు ఇప్పటికే మార్గనిర్దేశం చేశాయి" అని గుర్తు చేశారు."భావ ప్రకటన స్వేచ్ఛను గౌరవిస్తూ, జర్నలిస్టు కాయిత బాలు పై బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 ను తహసీల్దార్ వెంటనే ఉపసంహరించుకోవాలి" అని పేర్కొన్నారు.

# తెలంగాణ భవన్‌లో ఇల్లంతకుంట మండల ముఖ్య కార్యకర్తల సమావేశం

- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పల్లె నర్సింహ రెడ్డి

**బలగం టీవీ, ఇల్లంతకుంట**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తెలంగాణ భవన్ లో మంగళవారం మధ్యాహ్నం 3:00గం!లకు ఇల్లంతకుంట మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఉంటుందని ఈ కార్యక్రమంలో బాగంగా బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీ ఆర్ మానకొండూర్ మాజీ శాసన సభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ పాల్గొంటారని ఇల్లంతకుంట మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పల్లె నర్సింహ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు, ప్యాక్స్ ఛైర్మెన్ లు,వైస్ ఛైర్మేన్ లు,డైరెక్టర్లు,జిల్లా, మండల,గ్రామ నాయకులు,మాజీ ఉప సర్పంచ్ లు,మాజీ వార్డు సభ్యులు,బి.ఆర్ఎస్.పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు,అన్ని అనుబంధ సంఘాల అధ్యక్షులు,డైరెక్టర్లు, బి ఆర్ఎస్ పార్టీ శ్రేణులు,హాజరు కాగలరని ఆయన కోరారు

# ఏడేళ్లకే జాతీయ ఛాంపియన్‌షిప్



బలగం టీవీ, హైదరాబాద్

నాగ్‌పూర్‌కు చెందిన యువతార దివ్య దేశ్‌ముఖ్ చదరంగపు ప్రపంచాన్ని శాసిస్తోంది. 19 ఏళ్ల వయసులోనే ఫిడే మహిళల వరల్డ్‌కప్‌ను గెలిచి భారత దేశానికి అపార గౌరవం తీసుకొచ్చింది. టైటిల్ పోరులో అనుభవజ్ఞురాలైన కోనేరు హంపిని ఓడించిన దివ్య, ఫిడే వరల్డ్‌కప్‌ను గెలిచిన తొలి భారతీయ మహిళగా చరిత్రలో నిలిచింది.

మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వాసినైన దివ్య తల్లిదండ్రులు ఇద్దరూ డాక్టర్లే. దివ్య చిన్ననాటి నుంచి వైద్యురాలవాలని కలలుకన్నప్పటికీ, నాలుగేళ్ల వయసులో ఆమె చెస్ ప్రపంచంలోకి అడుగుపెట్టింది. భవాన్స్ భగవాన్‌దాస్ పురోహిత్ విద్యా మందిర్‌లో చదువుతున్న సమయంలో చదరంగంపై ఆసక్తి పెరిగింది. సోదరి ఆర్య బ్యాడ్మింటన్ క్లాసులకు వెళ్లిన సందర్భంలో అమ్మానాన్న చెస్ క్లాస్‌కు తీసుకెళ్లడంతో ఆ ఆటతో ప్రేమలో పడిపోయిందని దివ్య ఒక ఇంటర్వ్యూలో వెల్లడించింది.

దివ్య పదే పదే తన ప్రతిభను నిరూపించుకుంటూ వచ్చింది. ఏడేళ్లకే జాతీయ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుని దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది. 2021లో ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్ సాధించిన దివ్య, అదే ఏడాది ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా పొందింది. 2022లో ఇండియన్ చెస్ ఛాంపియన్‌షిప్‌ను గెలిచింది. చదరంగ బోర్డు ముందు దివ్య శాంతంగా కనిపించినా... ఆమె వ్యూహాలు ప్రత్యర్థుల్ని నష్టాల్లోకి నెట్టేస్తాయి.

**పర్సనల్ వైఫ్: సాహిత్య ప్రేమికురాలు**

టోర్నమెంట్‌ల మధ్య విరామ సమయంలో ఇంటిపట్టునే ఉండడం, చరిత్ర, సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు చదవడం దివ్యకు ఎంతో ఇష్టమట. నూతన ప్రదేశాలు తిరగడం కూడా ఆమెకు ఇష్టం.దివ్య దేశ్‌ముఖ్ విజయం భారత యువతకు ప్రేరణగా నిలుస్తోంది. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధిస్తూ, భారత మహిళా చెస్ చరిత్రలో స్వర్ణాక్షరాలతో తన పేరు లిఖించుకుంది.

# ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ విజేతగా దివ్య దేశ్‌ముఖ్

- **భారత చరిత్రలో కొత్త అధ్యాయం**
- **రాపిడ్ టైబ్రేక్‌లో హంపీపై గెలిచి తొలి భారతీయ మహిళగా ఫిడే టైటిల్ సాధన**



బలగం టీవీ, హైదరాబాద్

ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ 2025 విజేతగా యువ భారత గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ నిలిచింది. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో అనుభవజ్ఞురాలైన భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపీపై రాపిడ్ టైబ్రేక్ గేమ్‌లో గెలిచి అరుదైన ఘనతను దక్కించుకుంది. ఈ గెలుపుతో ఫిడే ప్రపంచకప్‌ను గెలిచిన తొలి భారతీయ మహిళగా దివ్య చరిత్ర సృష్టించింది.


**అద్భుత టైబ్రేక్ విజయం**

మొదటి రెండు క్లాసికల్ గేములు డ్రాగా ముగియడంతో విజేతను నిర్ణయించేందుకు రాపిడ్ టైబ్రేక్ నిర్వహించారు. 10 నిమిషాల సమయం, ప్రతి కదలికపై 10 సెకన్ల ఇన్‌క్రిమెంట్‌తో రెండో గేమ్‌లో హంపీ చేసిన ఒక చిన్న పొరపాటును దివ్య మెలకువగా వినియోగించుకుంది. 75వ ఎత్తులో హంపీ చేతులెత్తేయాల్సి వచ్చింది.

**చరిత్ర సృష్టించిన దివ్య**

కేవలం 19 ఏళ్ల వయస్సులోనే దివ్య గ్రాండ్‌మాస్టర్ హోదాను పొందడం గర్వకారణం. ఇప్పటివరకు భారత్‌కు 88వ గ్రాండ్ మాస్టర్‌గా, నాలుగో మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా ఆమె నిలిచింది. అంతేకాదు, మహిళల ఫిడే చెస్ వరల్డ్ కప్‌ను గెలిచిన తొలి భారతీయురాలిగా సరికొత్త చరిత్రను లిఖించింది.

ఈ ఫైనల్‌కు మరో ప్రత్యేకత ఉంది. ఫిడే మహిళల ప్రపంచకప్ చరిత్రలో తొలిసారిగా ఇద్దరు భారతీయ మహిళలు ఫైనల్లో తలపడటం జరిగింది. ఇది భారత చెస్ అభివృద్ధికి నిదర్శనం. దివ్య సెమీఫైనల్‌లో చైనా మాజీ ప్రపంచ ఛాంపియన్ టాన్ ఝోంగీపై గెలిచి ఫైనల్‌కి చేరిన సంగతి తెలిసిందే. దివ్య దేశ్‌ముఖ్ ఈ విజయం ద్వారా $ 50,000 (రూ. 41 లక్షలు) ప్రైజ్ మనీని గెలుచుకుంది. 2020లో ఆన్‌లైన్ ఒలింపియాడ్‌లో భారత జట్టుకు గోల్డ్ మెడల్ సాధించడంలో కీలక పాత్ర పోషించిన దివ్య, 2021లో 21వ మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపు పొందింది. తాజా విజయం ఆమె కెరీర్‌లో మైలురాయిగా నిలిచింది.




# 'అర్జున్ చక్రవర్తి' టీజర్ లాంచ్

బలగం టీవీ, హైదరాబాద్

స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన 'అర్జున్ చక్రవర్తి' సినిమా టీజర్‌ను డైరెక్టర్ హను రాఘవపూడి లాంచ్ చేశారు. విజయరామరాజు టైటిల్ రోల్ పోషించిన ఈ చిత్రానికి విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించగా, శ్రీని గుబ్బల నిర్మాణ బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటికే ఈ సినిమాకు 46 అంతర్జాతీయ ఫిల్మ్ అవార్డులు రావడం విశేషం.

ఈ సినిమా ఓ నిజ జీవిత కబడ్డీ ఆటగాడి జీవితం ఆధారంగా రూపొందిందని డైరెక్టర్ విక్రాంత్ రుద్ర వెల్లడించారు. "ఒక తల్లి బిడ్డను కనడానికి తొమ్మిది నెలలు మోస్తుంది. అలాగే నేను ఈ సినిమాను ప్రేక్షకులకు చూపించేందుకు తొమ్మిదేళ్లు మోశాను. పదమూడేళ్ల వయసులో అర్జున్ చక్రవర్తి అనే వ్యక్తిని కలిశాను. ఆయన చెప్పిన కథ నా మనసులో నాటుకుపోయింది. ప్రపంచానికి ఆ కథను చెప్పాలనేదే నాకు డైరెక్టర్ కావాలని కలగన్న మొదటి కారణం" అని ఆయన భావోద్వేగంగా తెలిపారు. టీజర్ గురించి స్పందించిన హీరో విజయరామరాజు, "హను గారికి మా టీజర్ లాంచ్ చేసినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు. టీజర్ చూసిన ప్రతి ఒక్కరూ ఎంతో అభినందిస్తున్నారు. ఈ సినిమా నా జీవితంలో చిరస్థాయిగా గుర్తుండిపోతుంది. ఇలాంటి క్యారెక్టర్ రావడం చాలా అరుదు. నా నటనపై ఎవైనా ప్రశంసలు అంటే.. అది మా డైరెక్టర్ విక్రాంత్ రుద్ర గారి శ్రమ వల్లే. ఆయన ఎంతో డెడికేషన్‌తో పని చేశారు. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. అందరూ మద్దతుగా నిలుస్తారని ఆశిస్తున్నాను" అన్నారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌కు సరిపోయేలా ఈ చిత్రం రూపొందిందని, భావోద్వేగాలతో కూడిన కబడ్డీ ఆటగాడి జీవితం ప్రేక్షకులను తప్పక అలరిస్తుందని చిత్రబృందం ఆశాభావం వ్యక్తం చేసింది.

# "కలాం"గా ధనుష్




బలగం టీవీ, హైదరాబాద్

దేశగర్వకారణమైన శాస్త్రవేత్త, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తిదాయక జీవితం త్వరలోనే సినిమా రూపంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. "మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా పేరు పొందిన కలాం జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న ఈ బయోపిక్‌కు 'కలాం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు, నేషనల్ అవార్డ్ విజేత ధనుష్ ప్రధాన పాత్రలో నటించనుండడం విశేషం. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను కేన్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అధికారికంగా ప్రకటించగా, అనంతరం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. సోమవారం ధనుష్ పుట్టినరోజు సందర్భంగా, చిత్ర యూనిట్ ఆయనకు ప్రత్యేక బహుమతిగా ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.షుటింగ్ త్వరలో ప్రారంభం కానుందని మేకర్స్ వెల్లడించారు.ఈ చిత్రానికి 'తానాజీ', 'ఆదిపురుష్' వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన ఓం రౌత్ దర్శకత్వం వహించనున్నారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్టైన్మెంట్స్, టీ-సిరీస్ సంస్థలు ఈ చిత్ర నిర్మాణ బాధ్యతలు చేపట్టగా, నిర్మాతలుగా అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ వ్యవహరిస్తున్నారు.

# 'అవతార్: ఫైర్ అండ్ యాష్' ట్రైలర్ విడుదల



బలగం టీవీ, హైదరాబాద్

హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన విజువల్ వండర్ 'అవతార్' సిరీస్‌లో మూడో భాగం 'అవతార్: ఫైర్ అండ్ యాష్' ట్రైలర్ తాజాగా విడుదలైంది. జులై 25న 'ది ఫెంటాస్టిక్ ఫోర్: ఫస్ట్ స్టెప్స్' సినిమా ప్రదర్శన సందర్భంగా ఈ ట్రైలర్‌ను థియేటర్లలో విడుదల చేశారు. పండోరా గ్రహంపై diesmal అగ్ని నేపథ్యం ఎత్తిచూపేలా సినిమా తెరకెక్కిందని ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది.

అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, వాస్తవికంగా చూపించిన పండోరా ప్రపంచం, నావీ తెగ సంస్కృతి – ఇవన్నీ ట్రైలర్‌ను మాయాజాలంగా మార్చాయి. తాజాగా అవతార్ ఫ్రాంచైజీ తమ అధికారిక సోషల్ మీడియా ఖాతా ద్వారా ఈ ట్రైలర్‌ను పంచుకోగా, అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా బ్రిటిష్ నటి ఊనా చాప్లిన్ పోషించిన 'వరంగ్' అనే పాత్రను పరిచయం చేశారు. నావీ తెగలో ఈ పాత్ర కీలకంగా ఉంటుందని సమాచారం. ట్రైలర్‌లో అగ్ని, బూడిదల థీమ్ చూపిస్తూ సినిమా మూడో భాగంపై అంచనాలు మరింత పెంచింది. 'అవతార్: ఫైర్ అండ్ యాష్' ఈ ఏడాది డిసెంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం సహా పలు భాషల్లో ఈ చిత్రం ప్రేక్షకులను అలరించనుంది. అవతార్ అభిమానులకు ఇది నిజమైన విజువల్ ట్రీట్‌గా నిలుస్తుందని భావిస్తున్నారు.

# పైరసీ నిర్మూలనకు కేంద్రం కీలక నిర్ణయం

బలగం టీవీ, హైదరాబాద్

చిత్ర పరిశ్రమను గత కొన్నేళ్లుగా పట్టిపీడిస్తున్న పైరసీ భూతాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ దిశగా 1952లో అమలులోకి వచ్చిన సినిమాటోగ్రాఫ్ చట్టానికి కీలక సవరణలు తీసుకురావడం ద్వారా మరోసారి కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయమంత్రి డా. ఎల్. మురుగన్ రాజ్యసభలో నూతన చట్ట సవరణలను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "పైరసీ వల్ల చిత్ర పరిశ్రమకు తీరని నష్టం జరుగుతోంది. కాబట్టి దీన్ని తీవ్రంగా తీసుకుని, నిర్దాక్షిణ్యంగా ఎదుర్కొనే సమయం ఆసన్నమైంది. పైరసీకి పాల్పడే వారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, భారీ జరిమానాలు విధించేలా నూతన చట్టం మార్గం సుగమం చేస్తుంది" అని స్పష్టంచేశారు. అలాగే.. చట్టంలో 6ఏఏ, 6ఏబీ సెక్షన్లు చేర్చినట్టు వెల్లడించారు. డిజిటల్ పైరసీని అరికట్టేందుకు సంబంధిత వాటాదారులు, చట్ట అమలు సంస్థలతో సమన్వయం కొనసాగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ఇంటర్ మినిస్టీరియల్ కమిటీ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఈ కమిటీపైరసీ నిరోధానికి వ్యూహాత్మక ప్రణాళికల రూపకల్పనతో పాటు అమలు పర్యవేక్షణ బాధ్యతలు వహించనుంది.

కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల తెలుగు చిత్ర పరిశ్రమతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర చిత్ర పరిశ్రమలు హర్షం వ్యక్తం చేశాయి. డిజిటల్ పైరసీ రూపంలో ఎదురవుతున్న సవాలును ఎదుర్కొనడంలో ఇది ఒక తిరుగుబాటు తరహా అడుగు అని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, బయ్యర్లు వంటి సినీ రంగానికి చెందిన అనేక వర్గాలు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ చట్టం సినిమాలకు ఆర్థిక రక్షణ కలిగించడమే కాదు, సృజనాత్మకతను ప్రోత్సహించేలా చేస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.




# లోక చాప్టర్ 1 - చంద్ర' టీజర్ రిలీజ్

బలగం టీవీ, హైదరాబాద్

నటి కళ్యాణి ప్రియదర్శన్ ప్రస్తుతం నటిస్తున్న చిత్రాల్లో ఎంతో ఆసక్తికరమైన సినిమా 'లోక చాప్టర్ 1 – చంద్ర'. ఇది మలయాళంలో ఫీమేల్ సూపర్‌హీరో థీమ్‌తో రూపొందుతున్న సినిమాగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. కళ్యాణి పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీ టీజర్‌ను స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ అధికారికంగా లాంచ్ చేశారు. "టీజర్ వచ్చేసింది.. ఈ ఓనమ్ థియేటర్లలో 'లోక' ప్రపంచాన్ని చూడండి" అంటూ ఆయన ట్వీట్ చేశారు.నస్లేన్ మరో కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో కథ రెండు భిన్నకాలాలను ఆవిష్కరిస్తూ సాగనుంది. టీజర్ ప్రకారం, గత కాలం మరియు ప్రస్తుత కాలం మధ్య కళ్యాణి పాత్రే కీలకమైన లింక్‌గా మారనుంది.